నేడు ఎమ్మెల్సీ ఉప ఎన్నికల

పోలింగ్

- ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పోలింగ్ బరిలో ముగ్గురు అభ్యర్థులు
- 10 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు.. పకడ్బందీగా ఏర్పాట్లు
- ఆపరేషన్ ఆకర్ష్, తాయిలాలతో క్రాస్ ఓటింగ్‌కు అవకాశం
- గెలుపుపై ఎవరిధీమా వారిదే..
- హోరాహోరీగా పోరాడుతున్న కాంగ్రెస్.. బీఆర్ఎస్
- నేడు క్యాంపుల నుంచి నేరుగా పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు
- ఏప్రిల్ 2న కౌంటింగ్‌తో తేలనున్న అభ్యర్థుల భవితవ్యం



మహబూబ్‌నగర్‌లో ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ రవి గుగులోత్



సామగ్రితో కేంద్రాలకు వెళ్తున్న ఎన్నికల సిబ్బంది

మహబూబ్‌నగర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు రంగం సిద్ధమైంది. గురువారం ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఉమ్మడి పాలమూరు జిల్లాలోని 10 కేంద్రాల్లో పోలింగ్ నిర్వహించనున్నారు. అందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పార్లమెంట్ ఎన్నికల ముంగిట ఈ ఎన్నిక రావడంతో రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ.. ఇటీవల అధికారం చేజారిపోయిన బీఆర్ఎస్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. ఈ గెలుపు పార్టీలకు కొంత మైలేజీ ఇస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో రెండు పార్టీల అభ్యర్థులు గెలుపుపై ధీమాతో ఉన్నారు. వాస్తవానికి స్థానిక సంస్థల్లో బీఆర్ఎస్‌కు మెజారిటీ బలం ఉంది. పదేళ్లుగా అధికారంలో ఉండటం, గత స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కువ స్థానాలను దక్కించుకోవడంతో ఈ పార్టీకి ఎన్నికల్లో గెలుపు నల్లేరుపై బండి నడకలా ఉండాలి. కానీ గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీలో చాలామంది స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు వలస వెళ్లారు. అయినప్పటికీ.. ఎమ్మెల్సీ ఎన్నిక నోటిఫికేషన్ విడుదల చేసే నాటికి బీఆర్ఎస్ బలం దాదాపు మూడు రెట్లు ఎక్కువగా ఉంది. అయితే అన్ని ఎన్నికల్లో ముందుగానే అభ్యర్థులను ప్రకటించే బీఆర్ఎస్.. ఎమ్మెల్సీ అభ్యర్థి విషయంలో కాస్తా ఆలస్యం చేసింది. మాజీ ఎమ్మెల్యేలు పలువురు పోటీ చేస్తారనే ఊహాగానాలు వినిపించినప్పటికీ ఉమ్మడి జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ నవీన్‌కుమార్‌రెడ్డికి అనూహ్యంగా టికెట్ కేటాయించారు. కాంగ్రెస్ ముందుగానే తమ అభ్యర్థిగా టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు, ఎంఎస్ఎన్ ల్యాబ్స్ డైరెక్టర్ మన్నె జీవన్‌రెడ్డికి టికెట్ కేటాయించింది. సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా ఈ నెల ఆరో తేదీన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన సభలో అభ్యర్థిని ప్రకటించారు. దీంతో కాంగ్రెస్ పార్టీలో ఫుల్ జోష్ నిండింది. ఈ క్రమంలోనే ఆ పార్టీ ఆపరేషన్ ఆకర్ష్‌కు కూడా తెరలేపడంతో బీఆర్ఎస్ నుంచి చాలా మంది స్థానిక ప్రజాప్రతినిధులు కాంగ్రెస్‌లో చేరారు. దీన్ని గమనించిన బీఆర్ఎస్ పార్టీ.. వెంటనే తమ ప్రజాప్రతినిధులను క్యాంపులకు తరలించింది. గోవా, కర్ణాటక వంటి ప్రాంతాలకు ఖర్చుకు వెనుకాడకుండా పంపించింది. దాంతో కాంగ్రెస్ పార్టీ కూడా క్యాంపులను మొదలుపెట్టి.. బీఆర్ఎస్ నుంచి చేరిన వారితోపాటు అప్పటికే కాంగ్రెస్‌లో ఉన్నవారిని తరలించింది. ఆర్థికంగా కొంత బలమైన అభ్యర్థులే బరిలో నిలవడంతో కొంతమేర తాయిలాలు ఇచ్చారు. అయితే ఎవరు ఎక్కువ ఇచ్చారనే విషయంలో మాత్రం స్పష్టత లేదని చెప్పొచ్చు. ఇరు పార్టీల అభ్యర్థులు రెండు క్యాంపుల్లో ఉన్నవారికి కూడా డబ్బులు ఇచ్చారని తెలుస్తోంది.

1,439 మంది ఓటర్లు..

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు 1,439 మందిని ఓటర్లుగా గుర్తించారు. ఇందులో ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు, కౌన్సిలర్లతోపాటు ఎక్స్ ఆఫిషియో ఓట్లు కూడా ఉన్నాయి. మొత్తం 10 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మహబూబ్‌నగర్‌లో 245 మంది ఓటర్లు ఓటు వేయనున్నారు. కొడంగల్‌లో 56 మంది, నారాయణపేటలో 205, వనపర్తిలో 218, గద్వాలలో 225, కొల్లాపూర్‌లో 67, నాగర్‌కర్నూల్‌లో 101, అచ్చంపేటలో 79, కల్వకుర్తిలో 72, షాద్‌నగర్‌లో 171 మంది తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఏర్పాట్లు చేశారు. మహబూబ్‌నగర్, కొడంగల్, నారాయణపేట, షాద్‌నగర్‌లో ఎంపీడీవో కార్యాలయాల్లో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వనపర్తిలో ఆర్డీవో కార్యాయలంలో, గద్వాలలో జడ్పీ మీటింగ్ హాల్‌లో, కొల్లాపూర్ బాలికల జూనియర్ కళాశాలలో, అచ్చంపేటలో బాలికల ఉన్నత పాఠశాలలో, నాగర్‌కర్నూల్‌లో బాలుర ఉన్నత పాఠశాలలో, కల్వకుర్తిలో ప్రభుత్వ జూనియర్ కాలేజీలో పోలింగ్ కేంద్రాలు సిద్ధమయ్యాయి. ఎన్నికల్లో ముగ్గురు అభ్యర్థులు పోటీపడుతున్నారు. ఏప్రిల్ రెండో తేదీన కౌంటింగ్ నిర్వహించనున్నారు.

క్రాస్ ఓటింగ్‌పై ఆశలు..

ఉమ్మడి జిల్లాలోని 10 కేంద్రాల్లో పోలింగ్ జరుగుతుండగా.. అన్ని కేంద్రాల వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పార్టీలు హోరాహోరీగా తలపడుతుండటంతో గొడవలకు దారితీసే అవకాశం కూడా ఉంది. క్యాంపులకు వెళ్లిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు నేరుగా పోలింగ్ కేంద్రాలకే చేరుకుని తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇప్పటికే గోవా క్యాంపునకు కేటీఆర్, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తోపాటు ఎమ్మెల్యేలు చాలామంది వెళ్లగా.. కాంగ్రెస్ తరఫున కూడా పలువురు ఎమ్మెల్యేలు క్యాంపుల్లో పాల్గొన్నారు. రెండు క్యాంపులకు రెండు పార్టీలు డబ్బులు ఇచ్చినట్లు తెలుస్తుండటంతోపాటు.. ఇటీవల పార్టీలు మారిన వారు కూడా ఓటు వినియోగించుకోవడానికి వస్తున్నారు. దాంతో గొడవలు జరుగుతాయని అన్ని జిల్లా కేంద్రాల్లో అందుబాటులో ఉన్న మొత్తం పోలీసు సిబ్బందిని బందోబస్తుకే వినియోగించనున్నారు. అయితే కాంగ్రెస్‌కు బలం లేకపోవడం, బీఆర్ఎస్‌కు బలం ఉన్నా.. ఎంతమంది ఓటు వేస్తారనే విషయంలో మాత్రం సందిగ్ధత ఉంది. ఎందుకంటే స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను గత ప్రభుత్వంలో పట్టించుకోలేదనే అసహనం వారిలో ఉంది. ఈ నేపథ్యంలో క్రాస్ ఓటింగ్‌పై కాంగ్రెస్ ఆశలు పెట్టుకోగా.. బీఆర్ఎస్ ఆందోళన చెందుతోంది. పార్లమెంట్ ఎన్నికల్లో ఎక్కువ సీట్లు గెలుచుకునేందుకు ఈ ఎన్నికను బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు గేట్‌వేగా భావిస్తుండటంతో ప్రతిష్ఠాత్మకంగా మారాయని చెప్పొచ్చు.

భారీ పోలీస్ బందోబస్తు



మహబూబ్‌నగర్‌లో పోలింగ్ జరుగనున్న ఎంపీడీవో కార్యాలయం వద్ద పోలీసు బందోబస్తు

మహబూబ్‌నగర్: ఎమ్మెల్సీ ఎన్నికలకు భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. ఈ ఎన్నికలను కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న నేపథ్యంలో ఎలాంటి గొడవలు లేకుండా ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్‌శాఖ అన్ని బూత్‌ల వద్ద పటిష్ఠ బందోబస్తును ఏర్పాటు చేస్తోంది. ప్రతీ బూత్ వద్ద 100 మందికిపైగా పోలీసులను బందోబస్తులో ఉంచనుంది. మహబూబ్‌నగర్‌లోని ఎంపీడీవో కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ వద్ద 145 మందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. ముగ్గురు డీఎస్పీలు, ఆరుగురు సీఐలు, 15 మంది ఎస్ఐలతో పాటు వంద మందికిపైగా సిబ్బంది బందోబస్తులో పాల్గొననున్నారు. పోలింగ్ బూత్‌కు 100 మీటర్ల దూరంలోనే అందరినీ నిలిపేయడం జరుగుతుందని, అనుమతిలేనిదే బూత్‌లోకి ఎవరినీ అనుమతించబోమని పేర్కొన్నారు.

ట్రేడ్ లైసెన్స్‌పై విముఖత

- వనపర్తి మునిసిపాలిటీలో తీసుకోని వ్యాపారులు
- పట్టణంలో 2,600 వరకు వాణిజ్య దుకాణాలు
- 50 శాతం కూడా పూర్తి కాని లైసెన్స్‌ల జారీ
- రూ. 2 కోట్ల దాకా నిలిచిన నిధులు



ఓ షోరూం యజమానికి ట్రేడ్ లైసెన్స్ రెన్యూవల్ నోటీస్ ఇస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ (ఫైల్)

వనపర్తి టౌన్, మార్చి 27: వనపర్తి జిల్లా కేంద్రంలో వ్యాపారాలు నిర్వహించే పలువురు వ్యాపారులు ట్రేడ్ లైసెన్సులు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. దాంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. పట్టణాల్లో వ్యాపారం నిర్వహించాలనుకునే వ్యాపారులు అందుకు సంబంధించిన ట్రేడ్ లైసెన్స్ ధ్రువీకరణ పత్రం తీసుకోవాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు మునిసిపల్ అధికారులు సంబంధిత షాపు దగ్గరికి వెళ్లి స్క్వేయర్ ఫీట్ ప్రకారం పన్ను విధిస్తారు. ఈ పద్ధతిలో ప్రతీ వ్యాపారి తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ పొందాలి. ఆ సర్టిఫికెట్‌ను ప్రతీ సంవత్సరం రెన్యూవల్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ సర్టిఫికెట్ వ్యాపారులకు ఒక రకంగా ఫస్ట్ ఎయిడ్ సర్టిఫికెట్ లాంటిది. అయితే ఈ లైసెన్స్‌లు కొందరు వ్యాపారులు తీసుకోవడం లేదని తెలుస్తోంది. తాము ఎలా వ్యాపారం చేసినా అడిగేవారే లేరన్నట్లుగా స్థానిక వ్యాపారులు కొందరు వ్యవహరిస్తున్నారు. వ్యాపారులు, మునిసిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా మునిసిపాలిటీకి అత్యంత కీలకమైన ఆదాయ వనరుల్లో ఒకటిగా చెప్పుకునే ట్రేడ్ లైసెన్స్ మరుగున పడే ప్రమాదం పొంచి ఉంది.

భారీ వ్యాపార సముదాయాలే అధికం..

వనపర్తి జిల్లా కేంద్రంలో భారీ వ్యాపారాలు నిర్వహిస్తున్న రైస్ మిల్లులు, పెట్రోల్ బంక్‌లు, సినిమా థియేటర్లు, ఫర్టిలైజర్, ఐరన్ అండ్ హార్డ్‌వేర్, బులియన్ మర్చంట్ షాపులు, షాపింగ్ మాల్స్, టెక్స్‌టైల్స్ వ్యాపారాలు నిర్వహించే యజమానులు సైతం ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవడం లేదు. ఇప్పటికే మునిసిపాలిటీకి రావాల్సిన ట్రేడ్ లైసెన్స్‌లు దాదాపు రూ.2 కోట్ల వరకు బకాయి ఉన్నట్లు తెలుస్తోంది. చిన్న చిన్న వ్యాపారాలు నిర్వహించే వారు లైసెన్స్‌లు పొందుతుంటే.. భారీ వ్యాపారాలు నిర్వహించే వారు మాత్రం ట్రేడ్ లైసెన్స్ మాకెందుకని పెడచెవిన పెడుతున్నారు. ప్రభుత్వ ఆదాయానికి వ్యాపారులు గండి కొడుతున్నా అధికారులు ఎందుకు ఉపేక్షిస్తున్నారో అంతుచిక్కడం లేదు.

మిగిలింది మూడు రోజులే..

ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నా.. ట్రేడ్ లైసెన్స్ ధ్రువీకరణ పత్రాలు మాత్రం పూర్తిస్థాయిలో జారీ కావడం లేదు. పట్టణంలో చిన్న, పెద్ద తరహా వ్యాపారాలు మొత్తం కలిసి దాదాపు 2,600 వరకు ఉన్నాయి. వాటిలో చిన్న వ్యాపారాలు చేసుకునేవారు దాదాపు వెయ్యికి పైగా మంది ట్రేడ్ లైసెన్స్ అనుమతులు పొందారు. ఇంకా 1,500 వరకు లైసెన్స్‌లు పొందాల్సి ఉంది. వారు ఎలాంటి లైసెన్స్‌లు లేకుండానే స్వేచ్ఛగా వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. అందులో 600 షాపుల వరకు రెన్యూవల్ చేసుకోవాల్సి ఉంది. వారికి మొదటి, రెండో నోటీసులు జారీ చేసి సరి పెట్టుకున్నారు. ఇప్పటికైనా రెన్యూవల్ చేసుకోకపోతే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరిస్తున్నారు.

సిబ్బంది కొరతే కారణం

సిబ్బంది కొరత వల్ల ట్రేడ్ లైసెన్స్‌లు జారీ చేయడంలో ఆలస్యం అవుతోంది. వనపర్తి పెద్ద పట్టణం కావడంతో లైసెన్స్ ఫీజు వసూలు చేయడానికి దాదాపు ఆరు మంది జవాన్‌లు అవసరం. కానీ ప్రస్తుతం పర్మినెంట్ జవాన్‌లు ఇద్దరే ఉన్నారు. ఎన్ఎంఆర్‌లతోనే జవాన్ పని చేయించుకుంటున్నాం.

- ఉమామహేశ్వర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్, వనపర్తి

అందుకే రీచ్ కాలేకపోతున్నాం

నూతన మునిసిపల్ చట్టం ద్వారా ట్రేడ్ లైసెన్స్ బిల్లులు అధికంగా వస్తున్నాయని పెద్ద వ్యాపారాలు నిర్వహించే వారు రాష్ట్ర వ్యాప్తంగా కోర్టును ఆశ్రయించారు. అందుకే ట్రేడ్ లైసెన్స్ వసూలులో 100 శాతం రీచ్ కాలేకపోతున్నాం. కొందరికి లైసెన్స్ పొందే విధానం తెలియకపోవడం వల్ల కూడా ఆదాయం సమకూరడం లేదు. ప్రతీ ఒక్క వ్యాపారి ట్రేడ్ లైసెన్స్ తప్పకుండా పొందాలి. అది వ్యాపారులకు మేలు చేకూర్చడంతోపాటు ప్రభుత్వ ఆదాయాన్ని పెంచుతుంది.

- పూర్ణచందర్, మునిసిపల్ కమిషనర్, వనపర్తి.

బీజేపీకి త్వరలో రాజీనామా

- కాంగ్రెస్‌లో చేరతా: మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చిత్తరంజన్ దాస్

కల్వకుర్తి, మార్చి 27 : బీజేపీకి రాజీనామా చేస్తున్నట్లు మాజీ మంత్రి జే. చిత్తరంజన్‌దాస్ తెలిపారు. త్వరలోనే సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి సమక్షంలో ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లురవి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు ప్రకటించారు. నాగర్‌కర్నూలు జిల్లా కల్వకుర్తి పట్టణంలోని తన నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీలోకి తనను ఆహ్వానించి జడ్చర్ల నుంచి ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయడానికి అవకాశం కల్పించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌లకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు. ఈనాటి రాజకీయ పరిస్థితుల్లో సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి మన ప్రాంతవాసి కావడం, ఎంపీ అభ్యర్థిగా మల్లురవిని ప్రకటించడంతో కాంగ్రెస్‌లో చేరేందుకు నిర్ణయించుకున్నట్లు తెలిపారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లురవిలతో కలిసి తాను పని చేశానని గుర్తు చేశారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గెలుపు కోసం తాను పని చేస్తానన్నారు. కల్వకుర్తి ప్రాంత అభివృద్ధే తన ఏకైక లక్ష్యమన్నారు. అనంతరం మాజీ మంత్రిని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చిమ్ముల శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి మిరియాల శ్రీనివాస్‌రెడ్డి శాలువాతో సత్కరించి స్వాగతం పలికారు. సమావేశంలో మాజీ సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, నాయకులు గోపిరెడ్డి చిన్నరాంరెడ్డి, రమాకాంత్‌రెడ్డి, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

ఏసీబీ వలలో తహసీల్దార్

- రూ.2 వేలు లంచం తీసుకుంటూ పట్టుపడిన గుండుమల్ అధికారి
- రికార్డ్ అసిస్టెంట్, ధరణి ఆపరేటర్ కూడా అదుపులోకి..




ఏసీబీకి చిక్కిన తహసీల్దార్ పాండు, రికార్డు అసిస్టెంట్, ధరణి ఆపరేటర్

కోస్గి రూరల్, మార్చి 27: నారాయణపేట జిల్లా గుండుమల్ తహసీల్దార్ పాండు బుధవారం లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు. మండలంలోని బోగారం గ్రామానికి చెందిన మల్లేష్ తన భూమిని వేరొకరికి అమ్మగా.. భూ రిజిస్ట్రేషన్ కోసం ఈ నెల 21న స్లాట్ బుక్ చేసుకొని, 22న తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లాడు. భూమి రిజిస్ట్రేషన్ చేయాలంటే రూ.1,500 లంచం ఇవ్వాలని తహసీల్దార్ డిమాండ్ చేశాడు. తన దగ్గర డబ్బులు లేవని మల్లేష్ చెప్పడంతో నీ భూమి కోసం రెండు గంటలు ఎక్కువగా పని చేశానని, కచ్చితంగా ఇవ్వాలని అన్నాడు. దాంతో ధరణి ఆపరేటర్ రవీందర్‌కు ఫోన్‌పే ద్వారా మల్లేష్ వెయ్యి రూపాయలు పంపించాడు. తరువాత మరుసటి రోజు మరో భూమి రిజిస్ట్రేషన్ కోసం డాక్యుమెంట్ తీసుకొని మల్లేష్ తహసీల్దార్ ఆఫీస్‌కు వచ్చాడు. దాంతో తహసీల్దార్ పాండు.. ఈశ్వర్‌గౌడ్‌కు 20 గుంటల భూమి అమ్ముతున్న డాక్యుమెంట్ అయితే నిన్ననే మాకు డబ్బులు తక్కువ ఇచ్చావని, ఒక్కో డాక్యుమెంట్‌కు 1,500 చొప్పున రెండింటికి మూడువేలు అవుతాయని చెప్పాడు. నిన్న వెయ్యి ఇచ్చావని, ఇంకో రూ.2,000 ఇవ్వకపోతే నీకు భవిష్యత్‌లో ఇబ్బంది అవుతుందని అన్నాడు. దాంతో మల్లేష్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఏసీబీ అధికారులు మల్లేష్‌కు బుధవారం రూ.2,000 ఇచ్చి పంపించారు. మల్లేష్ తహసీల్దార్‌ను సాయంత్రం కలువగా.. రికార్డ్ అసిస్టెంట్ మొగులప్పను పిలిచి డబ్బులు తీసుకోవాలని చెప్పాడు. అతను ఓ పాత పహణి రికార్డు తీసుకొని అందులో డబ్బులు పెట్టాలని చెప్పాడు. రికార్డు అసిస్టెంట్ ఆ రికార్డు తీసుకెళ్లి తహసీల్దార్‌కు ఇచ్చాడు. వెంటనే మల్లేష్ బయటకు వచ్చి ఏసీబీ అధికారులకు చెప్పడంతో వారు వచ్చి తహసీల్దార్‌ను పట్టుకున్నారు. రూ.2,000 తీసుకొని తహసీల్దార్‌తోపాటు రికార్డ్ అసిస్టెంట్, ధరణి ఆపరేటర్‌ను అదుపులోకి తీసుకున్నారు. గురువారం వారిని నాంపల్లి ఏసీబీ కోర్టులో ప్రవేశపెడతామని అధికారులు చెప్పారు.

మరమ్మతులేవీ?

- ఐదేళ్ల కిందట ర్యాలంపాడు రిజర్వాయర్‌కు రంధ్రాలు
- నాలుగు టీఎంసీలకు గాను 1.5 టీఎంసీలకు తగ్గిన నీటి నిల్వ
- లీకేజీలతో పంటలకు అందని నీరు
- రెండేళ్లుగా యాసంగిలో క్రాప్ హాలిడే
- సర్వే పూర్తయినా చేపట్టని పనులు



ర్యాలంపాడు రిజర్వాయర్(ఫైల్)

ధరూరు, మార్చి 27: జోగుళాంబ గద్వాల జిల్లాలో లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించే నెట్టెంపాడు ప్రాజెక్టులోని ర్యాలంపాడు రిజర్వాయర్‌కు ఐదేళ్ల కిందట రంధ్రాలు పడి, నీరు లీకవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. తనిఖీల పేరుతో కాలయాపన చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. రిజర్వాయర్ నీటి సార్థ్యం నాలుగు టీఎంసీలు కాగా, మరమ్మతుల పేరుతో ఐదేళ్ల నుంచి 1.5 టీఎంసీల నీటిని మాత్రమే నింపుతున్నారు. దాంతో సుమారు 1.36 లక్షల ఎకరాల ఆయకట్టుకు క్రాప్ హాలీడే ప్రకటించాల్సిన పరిస్థితి ఏర్పడింది.



రిజర్వాయర్ కట్ట నుంచి లీకవుతున్న నీరు(ఫైల్)

పంటలకు అందని నీరు

ర్యాలంపాడు రిజర్వాయర్‌ను పూర్తి స్థాయిలో నింపకపోవడంతో గత ఏడాదితో పాటు ఈ ఏడాది కూడా యాసంగి పంటలకు నీరు ఇవ్వలేమని అధికారులు చెప్పి, క్రాప్ హాలిడే ప్రకటించారు. రెండేళ్ల పాటు క్రాప్ హాలిడే ప్రకటించడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రిజర్వాయర్ నుంచి గట్టు మండలంలో నూతనంగా నిర్మిస్తున్న గట్టు రిజర్వాయర్‌కు నీటిని ఎత్తిపోయాలి. కానీ ర్యాలంపాడులోనే నీటి నిల్వలు లేకపోవడంతో గట్టుకు ఎలా ఎత్తిపోస్తారోనన్న సందేహం నెలకొంది. ఐదేళ్ల కిందట రిజర్వాయర్‌కు రంధ్రాలు గుర్తించిన అధికారులు వెంటనే మరమ్మతులు చేపట్టి ఉంటే పరిస్థితి ఇలా ఉండేది కాదని రైతులు అంటున్నారు.

రైతుల ఆందోళనతో సరే..

గత ప్రభుత్వం నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంపై చిన్న చూపు చూసింది. కనీసం రిజర్వాయర్ల మెయింటెన్స్‌కు కూడా నిధులను విడుదల చేయకపోవడంతో ఇటు రిజర్వాయర్లతో పాటు అటు కాల్వలు కూడా పూర్తి స్థాయిలో దెబ్బతిన్నాయి. ర్యాలంపాడు రిజర్వాయర్‌కు 2019లో రంధ్రాలు పడి నీరు లీకేజీ కావడం ప్రారంభమైంది. అప్పటి నుంచి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో లీకేజీ మరింత పెరిగి, నీటి నిల్వలు తగ్గుముఖం పట్టాయి. రిజర్వాయర్‌కు మరమ్మతులు చేయాలని రైతుల ఆందోళన చేయడంతో 2021లో రిటైర్డు ఇంజనీర్ల బృందం రిజర్వాయర్‌ను పరిశీలించింది. పూర్తి స్థాయిలో నీటిని నింపితే కట్టకు ప్రమాదమని అధికారులు గుర్తించారు. దాంతో రిజర్వాయర్ పూర్తి స్థాయి సామర్థ్యం నాలుగు టీఎంసీలకు గాను మూడేళ్లుగా కేవలం 1.5 టీఎంసీలు మాత్రమే నింపుతున్నారు. సర్వే పూర్తయి రెండేళ్లు దాటినా ఇప్పటి వరకు రిజర్వాయర్ల మరమ్మతు మాత్రం ప్రారంభం కాలేదు. రిజర్వాయర్‌లో ఇప్పుడు నీరు లేనందున పనులు చేపట్టి, వానా కాలం నాటిపైకా పూర్తి స్థాయిలో నింపేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

నివేదిక పంపించాం

ర్యాలంపాడు రిజర్వాయర్‌లో రంధ్రాలకు సంబంధించి సర్వే పూర్తి అయ్యింది. సర్వే నివేదికను అధికారులకు పంపించాము. టెక్నికల్ టీం పరిశోధనలు చేస్తోంది. సీడీవో ఆదేశాల మేరకు మరమ్మతులు చేపడతాం.

- వెంకటేశ్వర రావు, ఈఈ, ర్యాలంపాడు

పాము కాటుతో వ్యక్తి మృతి

ఆత్మకూరు, మార్చి 27 : పాము కాటుతో వ్యక్తి మృతి చెందిన సంఘటన వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం ఆరేపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ నరేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఏటికాడి చిన్న నాగన్న(64), ఆంజనేయులు మంగళవారం రాత్రి చేపల చెరువు వద్దకు కాపలాగా వెళ్లారు. నిద్రపోతున్న సమయంలో చిన్న నాగన్నకు ఏదో కుట్టినట్లు అనిపించడంతో లేచి నీరు తాగి మళ్లీ పడుకున్నాడు. తెల్లారాక ఆంజనేయులు నాగన్నను లేపడంతో లేవలేదు. నోటిలోంచి నురగ రావడంతో పాము కరిచి ఉంటుందని అనుకున్నాడు. కుటుంబీకులకు చెప్పడంతో ఆత్మకూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. నాగన్నకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. పెద్ద కుమారుడు ఏటికాడి ఆంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



నేడు చిన్నపిల్లలకు గుండె వైద్య శిబిరం

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం), మార్చి 27 : జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ పరిధిలోని ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో గురువారం చిన్న పిల్లలకు గుండె వైద్య శిబిరం నిర్వహించనున్నామని డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనరల్ ఆసుపత్రి ఆవరణలోని డీఈఐసీ కేంద్రంలో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఈ శిబిరం ఉంటుందని, హైదరాబాద్ కేర్ ఆసుపత్రి నుంచి వైద్యులు వస్తున్నారని తెలిపారు. అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.



పాలెంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీని లెక్కిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

పాలెం వెంకన్నస్వామి హుండీ లెక్కింపు

బిజినేపల్లి, మార్చి 27 : నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం పాలెంలోని వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీని బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా దేవాదాయ శాఖ పరిశీలకులు వెంకటేశ్వరి ఆధ్వర్యంలో లెక్కించారు. ఆలయ బ్రహ్మోత్సవాలు, శివరాత్రిలతో పాటు మూడు నెలలకు గాను హుండీ ద్వారా దేవాలయానికి రూ.3,88,673 నగదు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి సీహెచ్ రంగారావు తెలిపారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు కురవి రామానుజాచార్యులు, కమిటీ సభ్యులు సొప్పరి బాలస్వామి, పెద్ద కురుమయ్య, గోపాలస్వామి, వెంకటస్వామి, జ్యోతి, శ్రీదేవి, బంగారమ్మ, బండారు జగదీష్, జగన్‌మోహన్, శ్రీను, వెంకటేష్, శివకుమార్, బాబయ్య తదితరులు ఉన్నారు.

















కుష్ఠు నిర్మూలనపై దృష్టి

» వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే

» పాలమూరు జిల్లాలో ముగ్గురికి పాజిటివ్ ఉన్నట్లు నిర్ధారణ



ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న రాష్ట్ర, జిల్లా వైద్యాధికారులు

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం), మార్చి 27 : కుష్ఠు వ్యాధి నిర్మూలనపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాయి. ప్రతీ ఏడాది రెండుసార్లు ఇంటింటి సర్వే నిర్వహించి కేసులను గుర్తించాలని, ముందస్తుగా చికిత్సలు నిర్వహించి వ్యాధిని వ్యాపించకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. 2027 నాటికి దేశంలో కుష్ఠువ్యాధిని లేకుండా చేయాలనే లక్ష్యంతో ఆయా ప్రభుత్వాలు నిర్మూలన చర్యలు చేపట్టాయి. అందులో భాగంగానే ప్రతీ జిల్లాలో ఈ ఏడాది మొదటి విడత ఇంటింటి సర్వేలు చేపట్టాలని నిర్ణయించింది. ఈ మేరకు మహబూబ్‌నగర్ జిల్లాలో 14 రోజుల పాటు నిర్వహించిన ఇంటింటి సర్వే ముగిసింది. వ్యాధికి సంబంధించి మొత్తం 2,730 మంది అనుమానితులు ఉన్నట్లు గుర్తించగా, ముగ్గురికి పాజిటివ్ ఉన్నట్లు నిర్ధారించారు. అయితే గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది అనుమానితుల సంఖ్య పెరిగినా, పాజిటివ్ కేసుల సంఖ్య తగ్గింది.

వ్యాధి నిర్మూలనకు చర్యలు

గత 20 ఏళ్ల క్రితం జిల్లాలో కుష్ఠు వ్యాధి విపరీతంగా ఉండేది. కేంద్ర ప్రభుత్వం వివిధ రకాల నిర్మూలన చర్యలు చేపట్టడంతో దేశవ్యాప్తంగా అది తగ్గుముఖం పడుతూ వచ్చింది. ప్రస్తుతం దేశంలో అక్కడక్కడా మాత్రమే కేసులు నమోదవుతున్నాయి. ముందస్తుగా సర్వేలు నిర్వహించి కేసులను గుర్తించడంతో పాటు, ప్రత్యేకంగా మందులు కూడా అందజేసి వ్యాధిని వ్యాపించకుండా చేస్తున్నారు. పాజిటివ్ కేసులతో పాటు, అనుమానితులకు సైతం మందులు ఇచ్చి వ్యాధి వ్యాప్తిని అరికడుతున్నారు.

ముగిసిన 14 రోజుల సర్వే

జిల్లాలో ఈనెల 11 నుంచి 24 వరకు కుష్ఠు వ్యాధి కేసులను గుర్తించే ఇంటింటి సర్వేను చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా 1,91,060 ఇళ్లు, 10,04,071 మంది జనాభా ఉన్నారు. వైద్య ఆరోగ్యశాఖలోని 858 మంది ఆశ కార్యకర్తలతో ఇంటింటి సర్వే నిర్వహించారు. మొత్తం 24 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 1,91,860 ఇళ్లను సందర్శించి 9,03,413 మందిని సర్వే చేశారు. ఈ సర్వే ఐదు విడతలుగా నిర్వహించారు. 14 రోజుల పాటు ఈ సర్వే కొనసాగింది.

2,730 మంది అనుమానితులు

14 రోజుల పాటు ఇంటింటి సర్వేలో భాగంగా 2,730 మందికి కుష్ఠు వ్యాధి లక్షణాలు ఉన్నట్లు గుర్తించారు. వీరికి శరీరంపై తెల్లమచ్చలు వచ్చి ఎలాంటి నొప్పి లేకుండా ఉన్నవారిని అనుమానితులుగా పరిగణనలోకి తీసుకుంటారు. అయితే అనుమానితులకు అక్కడికక్కడే మందులు ఇచ్చారు. అంతేకాకుండా అనుమానితులతో పాటు, ముగ్గురికి పాజిటివ్ ఉన్నట్లు నిర్ధారించారు. వారికి ఆరు నెలల వరకు మందులు కూడా పంపిణీ చేశారు.

గత ఏడాదితో పోలిస్తే తక్కువే

గత ఏడాది కూడా రెండుసార్లు ఇంటింటి సర్వే చేశారు. ఆ సర్వేలో 2,505 మంది అనుమానితులను గుర్తించారు. అందులో కూడా పది పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. అయితే గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది అనుమానిత కేసులు పెరిగినప్పటికి పాజిటివ్ కేసుల సంఖ్య తగ్గింది. అనుమానితులు క్రమం తప్పకుండా మందులు వాడుతుండడంతో వ్యాధి వ్యాపించడం లేదు.

ప్రధాని మోదీని నిలబెట్టుకోవాలి

» మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి డీకే అరుణ



వాకర్స్‌తో మాట్లాడుతున్న డీకే అరుణ

మహబూబ్‌నగర్(క్లాక్‌టవర్), మార్చి 27 : దేశం కోసం, ధర్మం కోసం, పిల్లల భవిష్యత్ కోసం మోదీని నిలబెట్టుకోవాలని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఆ పార్టీ మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి డీకే అరుణ పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం ఆమె మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని డైట్ అండ్ బీఈడీ కళాశాలల మైదానంలో వాకర్స్‌ను కలిసి, ఓటును అభ్యర్థించారు. వికసిత్ భారత్ సంకల్పంతో ప్రధాని మోదీ ముందుకు వెళ్తున్నారని, ఆయనకు అండగా నిలబడాలని కోరారు. పాలమూరు సమస్యలపై తనకు అవగాహన ఉందని, వాటన్నింటిని పరిష్కరిస్తానన్న నమ్మకం ఉందని, గతంలో ఎమ్మెల్యేగా, మంత్రిగా తన పనితీరును చూశారని గుర్తు చేశారు. పాలమూరు ప్రజల ఆశీస్సులు ఉన్నాయని అనుకుంటున్నానని అభిప్రాయపడ్డారు. మార్నింగ్ వాక్‌లో బీజేపీ నాయకులు పి.శ్రీనివాస్‌రెడ్డి, పాండురంగారెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, బురుజు రాజేందర్‌రెడ్డి, పద్మవేణి తదితరులున్నారు.

కాంగ్రెస్‌తో అర్హులకు అభివృద్ధి ఫలాలు

» మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి



మాట్లాడుతున్న వంశీచంద్‌రెడ్డి

మహబూబ్‌నగర్, మార్చి 27 : కాంగ్రెస్‌ను ఆశీర్వదిస్తే అభివృద్ధి ఫలాలు అర్హులైన పేదలకు అందుతాయని మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని సుదర్శన్ కన్వెన్షన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన బూత్ లెవెల్ ఏజెంట్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇన్నాళ్ల అభివృద్ధిని విస్మరించారని, అందుకే కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అభివృద్ధితో పాటు, మెరుగైన సంక్షేమాన్ని అందిస్తుందని పేర్కొన్నారు. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకుని తాగునీరు, సాగునీరు అందించేందుకు కృషి చేస్తానన్నారు. పార్లమెంట్, ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆశీర్వదించాలని కోరారు. ఈ పార్లమెంట్ పరిధిలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెరుగుపరిచే బాధ్యత తనదని చెప్పారు. పదేళ్లు పాలించిన బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ప్రజలను అన్ని రంగాల్లో నిర్లక్ష్యానికి గురిచేయడంతో పాటు పూర్తిగా అన్ని వర్గాలను మోసం చేసిందని దుయ్యబట్టారు. బూత్ లెవల్ కార్యకర్తలు రానున్న 45 రోజులు కష్టపడి పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వినోద్‌కుమార్, ఎన్‌పీ వెంకటేశ్, సురేందర్‌రెడ్డి, సిరాజ్‌ఖాద్రి, లక్ష్మణ్‌యాదవ్, అబ్దుల్ హక్, అజ్మత్‌అలీ తదితరులున్నారు.

నాగర్‌కర్నూల్ జిల్లాలో
పట్టుబడుతున్న నగదు

» ఇప్పటివరకు రూ.తొమ్మిది లక్షల 69వేల 750 నగదు సీజ్

» ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

నాగర్‌కర్నూల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో నాగర్‌కర్నూల్ జిల్లాలో విస్తృతంగా వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నామని జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ తెలిపారు. జిల్లాలోని ఆరు చెక్‌పోస్టుల్లో తనిఖీలు చేపడుతున్నామని అన్నారు. తనిఖీల్లో బుధవారం వరకు 11 క్యాష్ సీజ్ కేసులు చేసి, రూ.9,69,750 నగదును సీజ్ చేశామన్నారు. అదేవిధంగా, 48 లిక్కర్ కేసులు, 1,078 ఐఎంఎఫ్ఎల్ మరియు బీర్‌బాటిల్స్, నాలుగు లీటర్ల సారాను సీజ్ చేసి, 94మందిని బైండోవర్ చేశామని, 23 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు.

భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తకు జైలుశిక్ష

నారాయణపేట, మార్చి 27 : వరకట్న వేధింపులకు గురి చేయడంతో పాటు, భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తకు పదేళ్ల జైలుశిక్ష, రూ.20 వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయాధికారి మహ్మద్ అబ్దుల్‌రఫీ బుధవారం తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళితే.. నారాయణపేట జిల్లా మక్తల్ మండలం భూత్పూరు గ్రామానికి చెందిన హరిజన నర్సింహ నాలుగేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన సవారమ్మను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. రెండునెలలు సజావుగా సాగిన వీరి కాపురంలో వరకట్న వేధింపులు మొదలయ్యాయి. రూ.రెండు లక్షల వరకట్నం, ఐదు తులాల బంగారం తీసుకురావాలని సవారమ్మను వేధింపులకు గురి చేయడంతో ఆమె 2020 అక్టోబరు 26న అదృశ్యమైంది. ఆ తర్వాత భూత్పూరు రిజర్వాయర్‌లోకి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. అప్పటి డీఎస్పీ మధుసూదన్‌రావు, హైదరాబాద్ అడిషనల్ డీసీపీ కేసును పరిశీలించారు. 16 మంది సాక్షులను విచారించి, నేరస్తులపై కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆకుల బాలప్ప 11 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి, వాదనలను వినిపించారు. మక్తల్ సీఐ చంద్రశేఖర్, ఎస్సై భాగ్యలక్ష్మిరెడ్డి, పోలీస్ కానిస్టేబుళ్లు కబీర్, భీమ్‌రాజ్ సాక్షులకు సమన్లు తాఖీలు చేయగా కోర్టు లైజన్ ఆఫీసర్ విజయ్ సాక్షులను క్రమ పద్ధతిలో కోర్టులో హాజరుపర్చారు. నేరస్తుడి నేరం రుజువు కావడంతో పదేళ్ల జైలుశిక్ష, రూ.20 వేల జరిమానా విధిస్తూ జిల్లా న్యాయాధికారి తీర్పునిచ్చారు. నేరస్తుడికి శిక్ష పడేలా చేసిన పోలీసులను ఎస్పీ యోగేష్‌గౌతమ్ అభినందించారు. పోలీసులకు త్వరలోనే రివార్డు అందిస్తామని ఆయన పేర్కొన్నారు.

నేడు సిర్సనగండ్ల దేవాలయంలో కొబ్బరికాయల వేలం పాట

చారకొండ, మార్చి 27 : రాష్ట్రంలో రెండో అపర భద్రాద్రిగా పేరుగాంచిన మండలంలోని సిర్సనగండ్ల అయోధ్యనగర్ (గుట్ట)లో వెలసిన సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు ఆలయ ఆవరణలోని స్వామివారి కల్యాణ మండపంలో దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారుల సమక్షంలో కొబ్బరికాయలు, తలనీలాలు, కొబ్బరిముక్కలు, లడ్డు, పులిహోర ప్రసాదాలు అమ్ముకునేందుకు వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ దేరం రామశర్మ, ఈవో మల్లెల రఘు, మేనేజర్ నిరంజన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు కొబ్బరికాయలకు రూ.ఐదు లక్షలు, తలనీలాలకు రూ.ఒక లక్ష, కొబ్బరి ముక్కలకు రూ.50 వేలు, లడ్డు, పులిహోరకు రూ.రెండు లక్షలు డిపాజిట్ డీడీ గాని నగదు రూపంలో గాని చెల్లించాలని తెలిపారు. వేలం పాట దారులు పాట పూర్తికాగానే 75 శాతం చెల్లించాలని, మిగతా నగదును 48 గంటల్లో చెల్లించాలన్నారు. నిర్ణీత సమయంలో నగదు చెల్లించకపోతే వేలం పాట రద్దు చేసి తిరిగి వేలం పాట వేస్తామని వారు పేర్కొన్నారు. వేలం పాటలో దేవాలయ సిబ్బంది, దేవాలయానికి సంబంధించిన వ్యక్తులు, దేవస్థానానికి బకాయిలు ఉన్నవారు గాని పాల్గొనవద్దని సూచించారు. లడ్డు, పులిహోర ప్రసాదాల వేలం పాటలో కేవలం బ్రాహ్మణులు మాత్రమే పాల్గొనాలని ఆలయ చైర్మన్ దేరం రామశర్మ తెలిపారు.

చక్రతీర్థంతో ముగిసిన బ్రహ్మోత్సవాలు



మామిళ్లపల్లిలో కోలాట ప్రదర్శన ఇస్తున్న కళాకారులు



మన్యంకొండలోని కోనేరులో స్వామివారికి చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు

బిజినేపల్లి, మార్చి 27 : నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని వట్టెం వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు చక్రతీర్థంతో ముగిసినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు, తెలంగాణ బార్ కౌన్సిల్ చైర్మన్ అనంత నరసింహారెడ్డి తెలిపారు. బుధవారం బ్రహ్మోత్సవాల ముగింపులో భాగంగా మహాపూర్ణాహుతి, శ్రీపుష్పయాగం వంటి ప్రత్యేక పూజ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో చేశారు. అనంతరం మూలవిరాట్‌కు ఆలయ స్థానాచార్యులు సముద్రాల శ్రీమన్నారాయణచార్యులు, ప్రధాన అర్చకులు వెంకట ప్రసాదాచార్యులు పంచామృతంతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని కోనేరులో ఉత్సవ విగ్రహాలకు శాస్త్రోక్తంగా చక్రస్నానాన్ని భక్తుల గోవిందనామ స్మరణల మధ్య వైభవంగా నిర్వహించి, బ్రహ్మోత్సవాలను ముగించారు. కార్యక్రమంలో బ్రహ్మోత్సవ కైంకర్యపరులు అనంత క్రాంతికుమార్‌రెడ్డి దంపతులు, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు సందడి ప్రతాప్‌రెడ్డి, సందడి నరేందర్‌రెడ్డి నరేందర్‌రెడ్డి, పెరుమాళ్ళ సచ్చితానంద రెడ్డి, పాండురంగారెడ్డి, చంద్రారెడ్డి, బండారు రాజశేఖర్, జక్కాల్‌రెడ్డి భాస్కరాచారి, నరసింహచారి, తివారీ, విజయ్‌మిశ్రా, శ్రీనివాస్, రామకృష్ణ, రామతేజ తదితరులు పాల్గొన్నారు.

మన్యంకొండలో...

మహబూబ్‌నగర్ రూరల్ : తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన మన్యంకొండ బ్రహ్మోత్సవాలు బుధవారంతో ముగిశాయి. స్వామివారికి అర్చకులు వేదమంత్రాల నడుమ కృష్ణా జలాలతో చక్రస్నాన కార్యక్రమాన్ని నిర్వహించారు. చక్రస్నానం అనంతరం స్వామివారిని ఆలయ ధర్మకర్త అళహరి మధుసూదన్‌కుమార్ ప్రత్యేకంగా అలంకరించి, అర్చకుల వేదమంత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి చక్రస్నాన కార్యక్రమాన్ని తిలకించారు.

మామిళ్లపల్లిలో...

ఉప్పునుంతల : ఉప్పునుంతల మండలం మామిళ్లపల్లి గ్రామంలోని లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి ఆలయ ఆవరణలో కోలాటం పోటీలు నిర్వహించారు. పోటీల్లో ఏడు టీంలు పాల్గొన్నాయి. ఇందులో మొదటి విజేత మల్కాపురం, రెండో విజేత తాండ్ర, మూడో విజేత అంబటిపల్లి, నాల్గవ విజేతగా గడ్డంపల్లి టీంలు గెలుపొందాయి. మొదటి విజేతకు కంసానిపల్లి మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ రూ.15 వేలు అందజేయగా, రెండో విజేతకు మొకురాల ఆంజనేయులుగౌడ్ రూ.10 వేల నగదు, మూడో విజేతకు దాసర్లపల్లి మాజీ సర్పంచ్ స్వర్ణలత రూ.5 వేలు, నాల్గవ విజేతకు దుడ్డ సాయిబాబు రూ.3 వేలు అందించారు. ఆలయ ఈవో శ్రీనివాసరావు, చైర్మన్ మాధవరం రాజల్‌రావు తదితరులున్నారు.

ఈతవనంతో పాటు, బైక్‌కు నిప్పు

» గుర్తు తెలియని వ్యక్తుల దుశ్చర్య

» రూ.రెండు లక్షల మేర నష్టం

అచ్చంపేట రూరల్, మార్చి 27 : గుర్తు తెలియని వ్యక్తులు ఈతవనంతో పాటు, ద్విచక్ర వాహనాన్ని తగలపెట్టిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం



కాలిపోయిన బైక్



దగ్ధమైన ఈత వనం

చౌటపల్లి గ్రామ శివారులో బుధవారం వెలుగులోకి వచ్చింది. చౌటపల్లి శివారులో అచ్చంపేటకు చెందిన రైతు మధుసూదన్‌గౌడ్ పొలంలో ఈత చెట్లను పెంచి దశరథం అనే వ్యక్తికి గుత్తకు ఇచ్చాడు. కాగా, గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి ఈతవనంతో పాటు, గుత్తేదారు దశరథం ద్విచక్ర వాహనానికి నిప్పు పెట్టగా పూర్తిగా దగ్ధమైంది. ఘటనలో దాదాపు రూ.రెండు లక్షల మేర నష్టం సంభవించినట్లు బాధితుడు వాపోయాడు.

సొంత పనులకు పంచాయతీ ట్రాక్టర్



సొంత పనులకు వాడుకుంటున్న గ్రామ పంచాయతీ ట్రాక్టర్

లింగాల, మార్చి 27 : గ్రామ పంచాయతీలో వివిధ పనులకు ఉపయోగించాల్సిన ట్రాక్టర్‌ను సొంత పనులకు ఉపయోగించుకుంటున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలం అంబట్‌పల్లిలో పంచాయతీ ట్రాక్టర్‌ను నడుపుతున్న డ్రైవర్ సొంత పనులకు ఆ వాహనాన్ని వాడుకుంటున్నాడని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. పంచాయతీ ట్రాక్టర్ ద్వారా గ్రామంలో రోడ్డు కిరువైపులా నాటిన మొక్కలకు నీళ్లు పోయడం, గ్రామంలోని చెత్తా చెదారాన్ని డంపింగ్ యార్డుకు తరలించడానికి మాత్రమే వాహనాన్ని వినియోగించి, మిగతా సమయంలో పంచాయతీ ఆవరణలో ఉంచాల్సిన నిబంధనలు ఉన్నాయి. పాలకవర్గం పదవీ కాలం ముగియడంతో పంచాయతీ పాలనను ప్రత్యేకాధికారితో పాటు పంచాయతీ కార్యదర్శి చూసుకోవాల్సి ఉంటుంది. కానీ ఈ గ్రామంలో నిబంధనలను అతిక్రమించి పంచాయతీ ట్రాక్టర్‌ను డ్రైవర్ సొంత పనులకు వాడుకోవడం ఏమిటని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై కలెక్టర్‌కు, జిల్లా పంచాయతీరాజ్ శాఖ అధికారికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

కాగా, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్‌ను వివరణ కోరగా ట్రాక్టర్‌ను సొంత పనులకు వాడుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అధికారుల ఆదేశాల మేరకు డ్రైవర్‌కు నోటీసులు ఇచ్చామని తెలిపారు.

నిద్రలోనే వ్యక్తి మృతి



వాకిటి నాగన్న (ఫైల్)

గోపాల్‌పేట, మార్చి 27 : వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం బుద్దారం గ్రామంలో నిద్రలోనే వ్యక్తి మృతి చెందాడు. బాధిత బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వాకిటి నాగన్న(55), భార్య తిరుపతమ్మ కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. మంగళవారం ఉదయం గ్రామంలోని చెరువులో మత్స్యకారులందరు కలిసి చేపల వేటకు వెళ్లారు. సాయంత్రం సమయంలో ఇంటికి చేరుకున్న నాగన్న స్నానం చేసి, భోజనం అనంతరం నిద్రపోయాడు. భార్య తిరుపతమ్మ బుధవారం ఉదయం ఎంత పిలిచినా పలకకపోవడంతో అప్పటికే మృతి చెంది ఉన్నాడు. మృతుడికి ఓ కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ విషయంపై తమకెలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

అదుపు తప్పిన బస్సు, ఇద్దరికి తీవ్ర గాయాలు

ఉండవల్లి, మార్చి 27 : జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలం టోల్‌ప్లాజా సమీపంలో బుధవారం తెల్లవారుజామున ప్రైవేటు ట్రావెల్ బస్సు అదుపు తప్పింది. ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి ప్రొద్దుటూరుకు 26 మంది ప్రయాణికులతో ఓ ప్రైవేటు ట్రావెల్ బస్సు మంగళవారం రాత్రి బయలుదేరింది. బుధవారం తెల్లవారుజామున పుల్లూరు టోల్‌ప్లాజా సమీపంలో డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో ఒక్కసారిగా బస్సు జాతీయ రహదారి నుంచి అదుపు తప్పి రోడ్డు కిందకు దిగిపోయింది. దీంతో బస్సులో ఉన్న ప్రొద్దుటూరుకు చెందిన లక్ష్మీదేవి తలకు, డ్రైవర్ జనార్దన్‌రెడ్డికి కాలికి తీవ్ర గాయమవగా, ప్రయాణికుల్లో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని చికిత్స నిమిత్తం హైవే అంబులెన్స్‌లో కర్నూల్ ఆసుపత్రికి తరలించారు.

మొక్కజొన్న లారీ బోల్తా



బోల్తా పడిన మొక్కజొన్న లారీ

మానవపాడు, మార్చి 27 : జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలం బోరవెల్లి స్టేజీ సమీపంలో మొక్కజొన్నల లారీ బుధవారం ఉదయం బోల్తా పడింది. హైవే సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. కర్నూల్ వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న మొక్కజొన్న లోడ్ లారీ బోరవెల్లి స్టేజీ సమీపంలోకి రాగానే ఒక్కసారిగా రెండు టైర్లు పగిలిపోయాయి. అదుపు తప్పి లారీ బోల్తా పడింది. దీంతో మొక్కజొన్నల బస్తాలు రోడ్డుపై పడ్డాయి. వెంటనే ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకున్నట్లు హైవే సిబ్బంది తెలిపారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రమాదం జరుగలేదని వారు చెప్పారు.

వాహనం బోల్తా, తప్పిన ప్రమాదం

నాగర్‌కర్నూల్ క్రైం, మార్చి 27 : నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని నాగనూల్ శివారులో బొలెరో వాహనం ప్రమాదవశాత్తు బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం నాగర్‌కర్నూల్ వైపు నుంచి వస్తున్న బొలెరో వాహనం బోల్తా పడడంతో అందులో ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. ఘటనపై పోలీసులను వివరణ కోరగా తమకెలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

మహిళ అదృశ్యం

మల్దకల్, మార్చి 27 : జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం బిజ్వారం గ్రామంలో మహిళ అదృశ్యమైంది. ఎస్సై సురేష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వడ్డే గోకారన్న భార్య సరోజ ఈనెల 24న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ కోసం వెతికినా జాడ కానరాలేదన్నారు. కుమారుడు అంజి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక, కలప రవాణా చేస్తున్న వాహనాల పట్టివేత

కోస్గి రూరల్, మార్చి 27 : ఎలాంటి అనుమతి లేకుండా తరలిస్తున్న ఓ ఇసుక ట్రాక్టర్, కలప ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై శేఖర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. కోస్గి మండలం గుండుమాల్ శివారులో బుధవారం అనుమతి లేకుండా ఇసుక రవాణ చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు తెలిపారు. అలాగే, కోస్గి పట్టణ శివారులోని మహబూబ్‌నగర్ రోడ్డు మార్గంలో చెక్‌పోస్టు వద్ద కలప రవాణ చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నామన్నారు. కలప ట్రాక్టర్‌ను ఫారెస్టు అధికారులకు అప్పగించనున్నామని, ఇసుక ట్రాక్టర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు ఎస్సై తెలిపారు.

కోడిపందెం స్థావరంపై పోలీసుల దాడి

» 11 మంది అరెస్టు

నాగర్‌కర్నూల్ క్రైం, మార్చి 27 : కోడి పందెం స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఎస్సై గోవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని చందుబట్ల గ్రామ శివారులో రహస్యంగా కోడి పందేలు ఆడుతుండగా దాడులు చేశామన్నారు. దాడిలో 11 మందితో పాటు, రూ.13 వేల నగదు, ఎనిమిది బైకులు, ఎనిమిది సెల్‌ఫోన్లు, రెండు పందెం కోళ్లను స్వాధీనపర్చుకున్నట్లు తెలిపారు. నిందితులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

తాగునీటి కోసం కష్టాలు

» ట్యాంకర్ వద్దకు ప్రజల బారులు

మిడ్జిల్(మహబూబ్‌నగర్), మార్చి 27 : మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలం పెద్దగుండ్లతండాలో తాగునీటి కోసం తండావాసులు నానా కష్టాలు పడుతున్నారు. తండాలో ఇంటింటికి తాగునీరు అందకపోవడంతో వారు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బుధవారం తండాకు వచ్చిన ట్యాంకరు చుట్టూ ప్రజలు గుమికూడి తాగునీటి కోసం తగవులాడుకున్నారు. ప్రస్తుత వేసవిలో తాగునీటిని ఇంటింటికి వచ్చే విధంగా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టాలని తండావాసులు కోరుతున్నారు.



దోనూర్‌లో తాగునీటి ట్యాంకర్ వద్ద బారులు తీరిన ప్రజలు



పెద్దగుండ్లతండాలో తాగునీటి ట్యాంకరు వద్ద గుమిగూడిన ప్రజలు

దోనూర్‌లో..

మిడ్జిల్ మండలం దోనూర్ గ్రామంలో తాగునీటి సరఫరా సక్రమంగా చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాగునీటి కోసం నిత్యం గ్రామంలో ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకర్ వద్ద ప్రజలు బారులు తీరారు. వేసవికాలం ప్రారంభంలోనే ఇలా ఉంటే మున్ముందు తమ పరిస్థితి ఏంటని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నా అవి సరిపోవడం లేదని, ట్యాంకరు వద్ద బిందెలతో కొట్లాడే పరిస్థితి నెలకొందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతాం.

- పంచాయతీ కార్యదర్శి రమేష్‌నాయక్

దోనూర్ గ్రామంలోని వాటర్ ట్యాంకుకు సరఫరా అయ్యే మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో కాస్త ఇబ్బంది జరిగింది. వెంటనే ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేశాం. ఇకపై ప్రజలకు తాగునీటిపరంగా ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతాం.

ఆలయ అభివృద్ధికి సహకరిస్తా

- రాకమకొండ తిరుమలనాథ స్వామిని దర్శించుకున్న వంశీచంద్‌రెడ్డి



పూజ చేస్తున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి

హన్వాడ, మార్చి 27 : మాదారం గుట్టపై వెలిసిన రాకమకొండ తిరుమలనాథ స్వామి ఆలయ అభివృద్ధికి సహకరిస్తానని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన తిరుమలనాథ స్వామి బ్రహ్మోత్సవాలలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆయనను ఆశీర్వదించారు. ప్రజా సమస్యలు పరిష్కరిస్తానని చెప్పారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తానని తెలిపారు. ఆయన వెంట పీసీసీ కార్యదర్శి ఎస్‌పీ వెంకటేష్, జిల్లా నాయకుడు సురేందర్‌రెడ్డి, మండలఅధ్యక్షుడు మహేందర్, వెంకటయ్య, షబ్బీర్‌హుస్సేన్, శ్రీశైలం, చెన్నయ్య పాల్గొన్నారు.

చిలువేరులో ముగిసిన కరాటే శిక్షణ



శిక్షణ పొందిన విద్యార్థులతో కరాటే మాస్టర్లు

మిడ్జిల్(మహబూబ్‌నగర్), మార్చి 27: మండలంలోని చిలువేరు యూపీఎస్ ప్రభుత్వ పాఠశాలలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన రాణిలక్ష్మీబాయి ఆత్మరక్షణ శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. కరాటే శిక్షణను విద్యార్థులకు కరాటే మాస్టర్ మల్లేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పాఠశాలలో నిర్వహించిన కరాటే శిక్షణ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. శిక్షణలో విద్యార్థులకు 24 మెలకువలను నేర్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శ్యామలాకుమారి, ఉపాధ్యాయులు గురుప్రసాద్‌గౌడ్, వెంకటయ్య, హర్యా శ్రీలత, రమేష్‌గౌడ్ ఉన్నారు.

'ఎంపీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలి'

మిడ్జిల్(మహబూబ్‌నగర్), మార్చి 27 : పాలమూరు ఎంపీ అభ్యర్థి డీకే అరుణ గెలుపు కోరం నాయకులు, కార్యకర్తలు శ్రమించాలని బీజేపీ నాయకుడు ముచ్చర్ల జనార్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో పార్టీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. పార్లమెంట్ ఎన్నికలలో పార్టీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాల్సిన అంశాల గురించి చర్చించారు. జనార్ధన్‌రెడ్డిని శాలువాలతో బీజేపీ నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేశ్వర్, నాయకులు లక్ష్మారెడ్డి, తిరుపతి, శేఖర్‌రెడ్డి, చెన్నయ్య, దేవేందర్ ఉన్నారు.

కూలి డబ్బులు అందక ఉపాధి కూలీల అవస్థ

- ఎండ వేడిమితో అంతంత మాత్రమే హాజరు

- వసతులు ఉన్నా వాడుకోని వైనం



కామారంలో ఉపాధి పనుల్లో పాల్గొన్న కూలీలు

నవాబ్‌పేట(మహబూబ్‌నగర్), మార్చి 27 : ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకంలో పాల్గొనేందుకు కూలీలు ఆసక్తి చూపడం లేదు. చేసిన పనికి సకాలంలో డబ్బులు రాకపోవడంతో పలు గ్రామాల్లో కూలీలు డబ్బులకోసం పోస్టాఫీసు, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. మండలంలో మొత్తం 54 గ్రామ పంచాయతీలలో ఉపాధి పనులు ప్రభుత్వం నిర్వహిస్తుండగా నిత్యం 3125 మంది కూలీలు పాల్గొంటున్నారు. వీరికి రెండు నెలలుగా డబ్బులు అందడం లేదు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది కూలీల సంఖ్య తగ్గినట్లు తెలిసింది. ప్రధానంగా పనులకు సంబంధించిన డబ్బులు అందకపోవడమేనని పలు గ్రామాల కూలీలు చెబుతున్నారు.

వసతులు నిల్

ఎండలు తీవ్రం కావడంతో కూలీలు పనులకు వెళ్లాలంటేనే జంకు తున్నారు. పని చేసే చోట పని చేస్తున్న కూలీలకు వసతులు కల్పించాల్సి ఉండగా చాలా గ్రామాల్లో వసతులు కల్పించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. దీనివల్ల కూలీలు మండు టెండలో పని చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా ఎండవేడిమికి కూలీలు అనారోగ్యం పాలుకాకుండా అవసరమైన ప్రథమ చికిత్స వసతులు అందుబాటులో ఉంచాలని, కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లు కూలీలకు టెంట్లు ఇవ్వకుండా వసతులు కల్పించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

డబ్బులు సకాలంలో చెల్లిస్తున్నాం : ఎంపీడీవో శ్రీనివాస్

మండలంలో ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు సకాలంలో డబ్బులు చెల్లిస్తున్నాం. అలాగే పనులు చేసే చోట వసతులు కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు ఆదేశాలు జారీ చేయడంతో పాటు అవసరమైన ప్రథమ చికిత్స అందించేందుకు అందుబాటులో ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉంచాం. కొందరికి వంద రోజులు పూర్తి కావడంతో పనుల్లో పాల్గొనడం లేదు. గ్రామాల్లో అవగాహన కల్పిస్తాం.

ప్రజల దాహార్తి తీర్చడమే లక్ష్యం

- వాసవీ క్లబ్ జోనల్ చైర్‌పర్సన్ వలకొండ శ్రీదేవి



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న వాసవీక్లబ్ జోనల్ చైర్మన్ వి.శ్రీదేవి

పాలమూరు, మార్చి 27 : ప్రజల దాహార్తి తీర్చడమే లక్ష్యంగా వాసవీక్లబ్ పని చేస్తోందని వాసవీ క్లబ్ జోనల్ చైర్మన్ వలకొండ శ్రీదేవి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో వేసవికాలంలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయటం సంతోషంగా ఉందన్నారు. సమాజంలో చేపట్టే వివిధ కార్యక్రమాల్లో చలివేంద్రం ఒకటన్నారు. సామాన్య ప్రజల కనీస అవసరాలు తీర్చటంలో వాసవీక్లబ్ ముందు వరుసలో ఉంటుందన్నారు. 23ఏళ్ల నుంచి వేసవికాలంలో చలివేంద్రం పట్టణంలో వాసవీక్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వాసవీక్లబ్, వనితక్లబ్ ఆధ్వర్యంలో ప్రతీ ఏడాది సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఇంటర్నేషనల్ సీనియర్ వైస్ ప్రసిడెంట్ వి.రామేశ్వర్ అన్నారు. ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయటం పట్ల ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జీవన్ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి డెవలప్‌మెంట్ కమిటీ డైరెక్టర్ బి.రఘు, శ్రీనివాస్, ఎ.రాఘవేందర్, మఖ్బల్ భీమ్, ఏ.సువర్ణ, పి.శిరీష, కె.చంద్రశేఖర్, వి.చంద్రశేఖర్, ఎస్.రాము, కె.ఆంజనేయులు, కె.సంతోష్, ఏ.శ్రీనివాసులు, శ్రీహరి, వీణ, సభ్యులు పాల్గొన్నారు.

తాటికొండ రోడ్డుకు

మోక్షం కలిగేనా ?

- నిధులున్నా ముందుకు రాని కాంట్రాక్టర్లు

- ప్రభుత్వానికి నివేదించామంటున్న అధికారులు

- ప్రభుత్వమే రోడ్డు వేయించాలంటున్న గ్రామస్థులు

భూత్పూర్, మార్చి 27 : మండలంలోని తాటికొండ గ్రామానికి గత కొన్నేళ్ల క్రితం బీటీ రోడ్డు వేశారు. అది ఇప్పుడు పాడైపోయి గుంతలమయంగా మారింది. రోడ్డు కోసం రూ. 77లక్షలు మంజూరు చేశారు. 44వ జాతీయ రహదారి నుంచి తాటికొండ గ్రామం మీదుగా మహబూబ్‌నగర్ పట్టణానికి ఈ దారిపై రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రోడ్డు మీదుగా ప్రతీ నిత్యం వందలాది వాహనాలు వెళుతుంటాయి. 44వ జాతీయ రహదారి నుంచి తాటికొండ మీదుగా జిల్లా కేంద్రానికి చేరుకోవడానికి దగ్గర ఉండడంతో చాలా మంది వాహనదారులు ఈ రోడ్డు మీదుగానే జిల్లా కేంద్రానికి వెళతారు. గత ప్రభుత్వంలో స్థానిక ఎమ్మెల్యే పలుమార్లు ఈ రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి, టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో నిధులు అలాగే మూలుగుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు వేయించాలని కోరుతున్నారు.



గుంతలమయంగా మారిన తాటికొండ బీటీరోడ్డు

కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు



చాలా ఏళ్లుగా మా గ్రామానికి వచ్చే రోడ్డు పాడైంది. అప్పటి ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి చాలా సార్లు నిధులు మంజూరు చేయించారు. టెండర్లు వేయ డానికి కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రావడం లేదు. రోడ్డు పాడైనందున రాక పోకలకు ఇబ్బందిగా మారింది. రాత్రిపూట దారి కనిపించక కిందపడుతున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రోడ్డు వేయించాలి.

- శ్రీనివాస్‌గౌడ్, తాటికొండ

రాత్రిపూట చాలా ఇబ్బంది



మా గ్రామానికి రోడ్డు వేయించారని చాలా సంతోష పడ్డాం. ఈ రోడ్డు మీదుగా ప్రతీనిత్యం వందలాది వాహనాలు జిల్లా కేంద్రానికి వచ్చిపోతుంటాయి. వర్షాలు పడ్డపుడు, రాత్రి సమయాల్లో వాహనదారులు, ఇతరులు రోడ్డు మీదుగా వెళ్లడానికి చాలా ఇబ్బంది పడుతున్నారు. ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులకు చాలా ఇబ్బందిగా ఉంటుంది.

- కుమార్, తాటికొండ

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం

తాటికొండ రోడ్డు పాడైపోయిన విషయం వాస్తవమే. చాలా సార్లు కాంట్రాక్టర్లను టెండర్లు వేయడానికి పిలిచాం. మాకు గిట్టుబాటు కాదని కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రావడం లేదు. పలుమార్లు టెండర్లు పిలిచాం. గిట్టుబాటు కాదని ఎవరూ ముందుకు రావడం లేదు. ఇప్పటికే ఒకటిరెండు సార్లు నిధులు వెనక్కి వెళ్లాయి. ఈ సారి నిధులున్నందున మరో మారు టెండర్లు పిలిచేందుకు ప్రయత్నం చేస్తాం. కాంట్రాక్టర్లు ముందుకు రానప్పుడే మేమేమీ చేయలేం. ఈ విషయంలో ప్రభుత్వ ఉన్నతాధి కారుల దృష్టికి తీసుకెళ్లాం. వారి నిర్ణయం మేరకుత్వరలో రోడ్డు వేయించడానికి ఉన్నతాధికారులే నిర్ణయం తీసుకుంటారు.

- సత్యకృష్ణ ఏఈ, పంచాయతీరాజ్ శాఖ

రైతులకిచ్చిన హామీలు ఏమయ్యాయి

- బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ

జడ్చర్ల(మహబూబ్‌నగర్), మార్చి 27 : అధికారంలోకి వచ్చేందుకు ఆరు గ్యారెంటీలంటూ తప్పుడు ప్రచారాలు చేపట్టిన కాంగ్రెస్ రైతులకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ ప్రశ్నించారు. బుధవారం పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా జడ్చర్లలో ఎన్నికల కార్యాలయం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుబంధు పథకం కింద డబ్బులు ఎంత మందికి ఇచ్చారు, ఎన్ని ఎకరాలకు ఇచ్చారో స్పష్టత లేదని, అది ఎప్పటిలోగ ఇస్తారో కూడా తెలియని పరిస్థితి నెలకొందని రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. రాష్ట్రంలో 17 ఎంపీ స్థానాలు కాంగ్రెస్ గెలిచి రాహుల్‌గాంధీ ప్రధాని అయితే రాష్ట్రంలో ఆరు గ్యారెంటీలు అమలువుతాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పడం ఆ పార్టీ నాయకులు ఇచ్చిన హామీలను ప్రజలు గమనించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు సీతారాం జావర్, జక్క రఘునందన్‌రెడ్డి, బాలాత్రిపుర సుందరి, అజయ్‌కుమార్, నర్సింహులు, జనార్దన్‌రెడ్డి, బాలకృష్ణ, ఎడ్ల బాలవర్ధన్‌గౌడ్, రాపోతుల శ్రీనివాస్‌గౌడ్, సాహితి రెడ్డి, నాగరాజు పాల్గొ న్నారు.

బీజేపీలో చేరిన కాంగ్రెస్ నాయకులు

మిడ్జిల్(మహబూబ్‌నగర్) : మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకుడు మేడిపల్లి నరేందర్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు బుధవారం పార్లమెంట్ అభ్యర్థి డీకే అరుణ సమక్షంలో బీజేపీలో చేరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేశ్వర్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు



జడ్చర్ల : సమావేశంలో మాట్లాడుతున్న డీకే అరుణ

పల్లె తిరుపతి, బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్, నరేష్‌నాయక్ ఉన్నారు.

అభ్యర్థి విజయానికి కష్టపడాలి

దేవరకద్ర : పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతీ కార్యకర్త కష్టపడి బీజేపీ ఎంపీ అభ్యర్థిని గెలిపించుకోవాలని నియోజకవర్గ ఇన్‌చార్జి కొండ ప్రశాంత్‌రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని కౌకుంట్ల మండల కేంద్రంలోని పార్టీ కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో గ్రామాల్లో తిరిగి పార్టీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల నాయకులు రవీందర్, ఆంజనేయులు, రాజు, రవి, రాములు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నోరెళ్లబెట్టిన ఊకచెట్టువాగు

- అడుగంటుతున్న భూగర్భ జలాలు

- వ్యవసాయ, తాగునీటికి ఇక కటకటేనా ?



చిన్నచింతకుంట శివారులో చుక్కనీరు లేక వెలవెలబోతున్న ఊకచెట్టువాగు

చిన్నచింతకుంట, మార్చి 27 : ఎండలు మండుతున్నాయి. గ్రామాల్లో భూగర్భజలాలు తగ్గుతున్నాయి. మండలంలోని చాలా గ్రామాలకు సాగు, తాగు నీటికి కల్పతరువుగా ఉన్న ఊకచెట్టువాగు చుక్కనీరు లేక నోరెళ్లబెట్టింది. దీంతో సమీప గ్రామాలకు తాగు, సాగునీటికి రానున్న రోజుల్లో మరింత ఇబ్బందులు తప్పేలా లేవు. మండలంలోని బండర్‌పల్లి, లాల్‌కోట, నెల్లికొండి, పెద్ద వడ్డెమాన్, చిన్న వడ్డెమాన్, ఏదులాపూర్, చిన్నచింతకుంట, మద్దూరు, అల్లీపురం, కురుమూర్తి, గూడూరు, కౌకుంట్ల మండలం ముచ్చింతల, దాసర్‌పల్లి, తిర్మలాపూర్, అప్పంపల్లి గ్రామాల శివారు అంతా ఊకచెట్టువాగు సమీపంలోనే ఉంటుంది. ఒకసారి భారీ వర్షాలు కురిసి, వాగు నిండుగా పారితే ఏడాదిపాటు తాగు, సాగు నీటికి ప్రజలకు ఎలాంటి ఢోకా ఉండదు. ప్రస్తుతం ఊకచెట్టువాగులో చుక్కనీరు లేని కారణంగా మండలంలోని ఆయా గ్రామాల్లో భూగర్భజలాలు ఒక్క సారిగా పడిపోతున్నాయి. దాంతో గ్రామాల్లోని ప్రజల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతున్నది. వ్యవసాయబోర్లు సైతం నీరు గతంలో మాదిరిగా అంతగా రావటం లేదని రైతులు అంటున్నారు. వరి, చెరుకు తదితర పంటలు చేతికి వచ్చే సమయంలోనే నీరు లేనికారణంగా పంటల దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరుకు రైతులు కూడా చాలీచాలని నీటితో దిగులు చెందుతున్నారు. వరి రైతుల పరిస్థితి మరింత దారుణంగా మారింది.

ఉల్లి రైతుకు నిరాశ

- గరిష్ఠంగా. రూ. 1400 - కనిష్ఠంగా. రూ. 900



మార్కెట్‌కు వచ్చిన ఉల్లి పంట

దేవరకద్ర, మార్చి 27 : ఈ సారైనా మంచి ధర వస్తుందనుకొని ఉల్లి పంటను మార్కెట్‌కు తీసుకొచ్చిన రైతన్నకు నిరాశే మిగిలింది. గతేడాది డిసెంబరులో ఉల్లి ధరలు బాగా పెరిగిన సమయంలో రైతు వద్ద దిగుబడులు లేని పరిస్థితి ఉండేది. ఇప్పుడు ఉల్లి దిగుబడులు పెద్దఎత్తున వచ్చినప్పటికీ ధరలు మాత్రం పెరగడం లేదు. రెండు నెలల నుంచి ఉల్లి ధరలు రూ.200 అటు ఇటుగా ఉంటున్నాయి. గరిష్ఠంగా ధరలు వచ్చిన రైతులకు కొంత వరకు లాభాలు వస్తుండగా కనిష్ఠంగా ధరలు వచ్చిన రైతులు నష్టాలను భరించక తప్పడం లేదు. పెట్టుబడులు రాక రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. దేవరకద్ర మండలంలోని వివిధ గ్రామాలలో రైతులు పండించిన ఉల్లి విక్ర యించేందుకు బుధవారం వ్యవసాయ మార్కెట్ యార్డుకు తీసుకొచ్చారు. మార్కెట్‌లో జరిగిన లావాదేవీల్లో ఉల్లి ధరలు రోజు రోజుకు తగ్గుముఖం పట్టాయి. వ్యాపారుస్తులు నిర్వహించిన వేలంలో గరిష్ఠంగా రూ.1400, కనిష్ఠంగా రూ.900 ధర పలికినట్లు మార్కెట్ సెక్రటరి ఎల్లయ్య తెలిపారు. మార్కెట్‌లో వ్యాపారస్థులు కాక బయట నుంచి వచ్చిన చిరు వ్యాపారులు ఉల్లిని కొంటున్నారు. ఉల్లి కొని బయట ఎక్కువ ధరకు విక్రయిస్తారు. ఉల్లిని విక్రయించేందుకు వచ్చిన వ్యాపారులు, కొనుగోలుదారులు ఉల్లిని కొనుగోలు చేశారు. మార్కెట్‌కు వచ్చిన ఉల్లిలో తెల్లగా, నా ణ్యతగా ఉన్న వాటికి కొంతవరకు డిమాండ్ ఉండగా ఇక ఎర్ర ఉల్లిని కొనేవారు కరువయ్యారు. వ్యాపారులు, చిరు వ్యాపారులు ఎక్కువగా ఎర్ర ఉల్లిని కొనుగోలు చేశారు. మార్కెట్‌కు 975 క్వింటాళ్ల ఉల్లిపంట అమ్మకా నికి వచ్చినట్లు తెలిపారు.

దిగుమతులు పెరిగినందుకే...

కర్నూల్-హైదరాబాద్ మార్కెట్‌లకు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి వందలాది లారీల ఉల్లి దిగుమతులు వచ్చిన కారణంగా ధరలు పడిపోయాయని వ్యాపారులు అంటున్నారు. బయట నుంచి వచ్చే ఉల్లి ధర కన్నా మన మార్కెట్‌లో రూ.200 నుంచి రూ.300 వరకు ఎక్కువగా ఉన్నాయని వ్యాపా రులు తెలిపారు. ఎక్కువగా ఎర్ర ఉల్లిని పండించిన కారణంగా ధరలు రావడం లేదని అంటున్నారు. తెల్ల ఉల్లికి కొంత వరకు డిమాండ్ ఉన్నా ధరలు తగ్గతున్నాయి.

పల్లెల్లో మళ్లీ సారా తయారీ

జడ్చర్ల (మహబూబ్‌నగర్), మార్చి 27 : సారాపై గత ప్రభుత్వం ఉక్కు పాదం మోపడంతో తయారీ కనుమరుగైంది. సారా తయారు చేయాలంటేనే హడలిపోయిన వారంతా నేడు నాటుసారా తయారు చేయటాన్ని మొదలెడు తున్నారు. సారా తయారు చేస్తూ, విక్రయిస్తూ పట్టుబడడంతో రూ.లక్ష జరిమానా చెల్లించిన సంఘటనలు ఉండడంతో వారంతా సారా తయారీకి స్వస్తి పలికారు. ప్రభుత్వం కఠినంగా వ్యవహరించకపోవడంతో నాటుసారా తయారు చేసేందుకు కొందరు సిద్ధమవుతున్నారు. నాటుసారా తయారీకి కావలసిన బెల్లం, నవసాగరంను పెద్దఎత్తున తరలిస్తూ పట్టుబడడంతో నాటుసారా తయారీ మళ్లీ మొదలైన అంశం వెలుగులోకి వచ్చింది. తాజాగా మిడ్జిల్ మండలం పెద్దగుండ్లతండాలో ఎక్సైజ్ అధికారులు దాడులు చేసి బుజ్జమ్మ అనే మహిళ వద్ద రెండు లీటర్ల నాటుసారాను పట్టుకున్నారు. నాటుసారా తయారీకి వినియోగించే బెల్లం, నవసాగరంను వలపన్ని హైదరాబాద్‌లోని మలకోపేట సమీపంలోని నల్గొండ ఫ్లైఓవర్ వద్ద జడ్చర్ల ఎక్సైజ్ అధికారులు ఏకంగా 540 కిలోల బెల్లం, 100



సారా తయారీకి వినియోగించే బెల్లం, నవసాగరంను పట్టుకున్న ఎక్సైజ్ అధికారులు (ఫైల్)

కిలోల నవసాగరం పట్టుకున్నారు. జడ్చర్ల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గడిచిన మూడు నెలల్లో బెల్లం పానకం ధ్వంసం చేసిన సంఘటనలున్నాయి. తండాలలో నాటుసారాను ప్రస్తుతం గుట్టుచప్పుడు కాకుండా తయారు చేస్తున్నారు. సారా తయారు చేస్తున్న వారిపై గత ప్రభుత్వం మాదిరిగా కఠినంగా వ్యవహరించబోమని, వారిపై చర్యలు తీసుకోకుండా తాను అండగా నిలబడ్తానంటూ మొన్నటి ఎన్నికల ప్రచారంలో ప్రస్తుత ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి ఇచ్చిన హామీ వారికి తోడయ్యింది. ఒకవేళ పట్టుబడినా ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే అండగా ఉంటాడన్న భరోసాతో తయారు చేయడానికి సిద్ధమవుతున్నారు. నాటుసారాపై ఎక్సైజ్ అధికారులు దాడులు చేసి, చర్యలు తీసుకుంటారా అనే సందేహాలు వెలువడుతున్నాయి.

పనుల పరిశీలన

గండీడ్, మార్చి 27 : మండలంలోని వెన్నాచేడ్ గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పథకం పనులను ఎంపీడీవో దేవన్న బుధవారం పరిశీలించారు. ప్రతీ కుటుంబానికి 100 రోజులు పని కల్పించాలని కోరారు. మస్టర్, రిజిస్టర్‌ను పరిశీలించారు. ఆయన వెంట ఏపీవో హరిచంద్రుడు, కార్యదర్శి ఖలీల్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీలో ఎవరికి మెజార్టీ

హన్వాడ, మార్చి 27 : మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో మండలం నుంచి 15 మంది ప్రజాప్రతినిధులు ఓటు వేయనున్నారు. 14 మంది ఎంపీటీసీ సభ్యులు, ఒక జడ్పీటీసీ సభ్యుడు ఉన్నారు. ప్రస్తుతం 13 మంది ఎంపీటీసీ సభ్యులు, ఒక జడ్పీటీసీ సభ్యుడు బీఆర్ఎస్ పార్టీలో ఉండగా ఒక పెద్దదర్‌పల్లి ఎంపీటీసీ సభ్యుడు కాంగ్రెస్ పార్టీలో ఉన్నారు. మెజార్టీ బీఆర్ఎస్ సభ్యులు ఉన్నా క్రాస్ ఓటింగ్‌కు పాల్పడుతారేమోనని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికే బీఆర్ఎస్‌లోని కొందరు కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నుంచి ఏదో ఆశించి మద్దతు ఇస్తున్నట్లు సమాచారం. వారం నుంచి బీఆర్ఎస్ క్యాంప్ నిర్వహించి పార్టీ పెద్దలు వారితో మాట్లాడడంతో ప్రస్తుతం బీఆర్ఎస్‌కు ఓటు వేసేందుకు సిద్ధం అయినట్లు తెలిసింది. కాగా కొందరు ఎంపీటీసీ సభ్యులు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నుంచి డబ్బులు తీసుకున్నట్లు సమాచారం.

ఎండిన పంటలకు నష్టపరిహారం అందించాలి : టీపీఎఫ్

పాలమూరు, మార్చి 27 : తెలంగాణ రాష్ట్రంలో అకాల వర్షానికి నష్టపోయిన రైతులకు, ఎండిన పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం అందజేయాలని తెలంగాణ ప్రజాఫ్రంట్ జిల్లా సమన్వయకర్త పి.బుచ్చారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ ఏడాది ఎండలు అధికమవటంతో భూమిలో నీరు ఇంకిపోవటం వలన బోరు బావుల్లో నీరు రాక బోరుకింద వేసిన పంటలు ఎండిపోయాయన్నారు. నష్టాలపాలైన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు.

'అభ్యర్థి విజయం కోసం పని చేయాలి'

బాలానగర్, మార్చి 27 : బీజేపీ నాయకులు, కార్యకర్తలు తమ అంతర్గత విభేదాలు వీడి, పార్టీ ఎంపీ అభ్యర్థి విజయం కోసం పని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆ పార్టీ యువమోర్చా మండల ప్రధాన కార్యదర్శి శ్యాంసుందర్ కోరారు. గురువారం ఒక ప్రకటనలో తమ పార్టీ నాయకులను, కార్యకర్తలను కోరారు. జూనియర్, సీనియర్, కొత్త పాత తేడా లేకుండా అందరం బీజేపీ కేంద్ర నాయకత్వం నిర్ణయం మేరకు నిర్ణయించిన ఎంపీ అభ్యర్థి డీకే అరుణ విజయం కోసం కలిసికట్టుగా పని చేయాలని కోరారు.

మెరుగైన వైద్యం అందించాలి

- వైద్యాధికారులు అందుబాటులో ఉండాలి

- నారాయణపేట కలెక్టర్ కోయ శ్రీహర్ష

నారాయణపేట, టౌన్ మార్చి 27 : ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు వైద్యాధికారులు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో వైద్యాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్య సిబ్బంది ఎవరెవరూ ఏ పని నిర్వహిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ఫీల్డ్‌లో ఏం చేశారు. ఎన్ని ఇళ్లు విజిట్ చేశారు. తదితర వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మందులు ఎలా పంపిణీ చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా సబ్ సెంటర్లు, పీహెచ్‌సీల వారిగా మందుల పంపిణీపై ఆరా తీశారు. లైప్రసీ కేసులు ఎన్ని వచ్చాయి. మార్చిలో ఏ పని చేశారు అని అడిగి తెలుసుకున్నారు. బయోమెట్రిక్ హాజరు లేకపోతే జీతం కట్ చేయాల్సి వస్తోందని డీఎంహెచ్‌వోకు హెచ్చరించారు. విధులకు మూడు రోజులు ఆలస్యమైన చో జీతం కట్‌చేస్తారని కలెక్టర్ అన్నారు. ప్రతీ రోజు బయోమెట్రిక్ వేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో సౌభాగ్యలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జోరుగా ధాన్యం విక్రయాలు

నారాయణపేట, మార్చి 26 : నారాయణపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం ధాన్యం విక్రయాలు జోరుగా కొనసాగాయి. వేరు శనగలు 24 క్వింటాళ్ల విక్రయానికి రాగా, క్వింటాలుకు ధర గరిష్ఠంగా రూ.6,020, కనిష్ఠంగా రూ.5,869 పలికింది. జొన్నలు 332 క్వింటాళ్ల విక్రయానికి రాగా, క్వింటాలుకు ధర గరిష్ఠంగా రూ.4,913, కనిష్ఠంగా రూ.3,632, పెసర్లు 52 క్వింటాళ్ల విక్రయానికి రాగా, క్వింటాలుకు ధర గరిష్ఠంగా రూ.8,825, కనిష్ఠంగా రూ.8,260, ఆలసంద లు ఏడు క్వింటాళ్ల రాగా, క్వింటాలుకు ధర గరిష్ఠంగా రూ.7,526, కనిష్ఠంగా రూ.5,859, ఎర్ర కందులు 17 క్వింటాళ్ల రాగా, క్వింటాలుకు ధర గరిష్ఠంగా రూ.10,009, కనిష్ఠంగా రూ.2,970 పలికింది.

'పాఠశాలలో నీటి కష్టాలు తీర్చాలి'

నారాయణపేట రూరల్, మార్చి 27 : మండల పరిధిలోని అప్పిరెడ్డిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థుల తాగునీటి కష్టాలు తీర్చాలని కోరుతూ బుధవారం ఎంపీడీవో శ్రీనివాస్‌కు సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ డివిజన్ నాయకుడు ప్రశాంత్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల ఆవరణలో సింగల్ ఫేస్ మోటారు బోరుతో పాటు చేతి పంపులు ఉన్నాయని, అవి కొంతకాలంగా మరమ్మతుల పాలై నీటిని అందించలేని దుస్థితిలో ఉన్నాయన్నారు. ఎనిమిదవ తరగతి వరకు ఉన్న పాఠశాలలో 166 మంది విద్యార్థులుండగా మిషన్ భగీరథ తాగునీరు సరిపోవడం లేదన్నారు. అవి కూడా ఎప్పుడు వస్తాయో ఎప్పుడు రావో చెప్పలేని దుస్థితి దాపురించిందన్నారు. అధికారులు స్పందించి విద్యార్థులకు తాగు నీటి కష్టాలు తీర్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.